

రైతులు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

భీమవరం: ఆగ్నేయ బంగాళాఖాతంలో పశ్చిమ వాయువ్య దిశగా ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో ఈ నెల 11, 12 తేదీల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, దీనిపై అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. వరి పంట కుప్పలు వేసి ఉంటే ఈ నెల 12వ తేదీ తర్వాత నూర్పిడి చేయాలని, కోతలు కోసినవి ఉంటే వెంటనే కుప్పలు వేయడం, నూర్చిన ధాన్యం ఉంటే సురక్షిత ప్రదేశాలకు తరలించాలని రైతులను కోరారు. ఎక్కడైనా సురక్షిత ప్రదేశాలు లేకపోతే సివిల్ సప్లయిస్ అధికారులకు తెలియజేయాలన్నారు. రైతులకు టార్ఫాలిన్లు లేకపోతే ఆర్‌ఎస్‌కెలకు తెలియజేయాలన్నారు. రైతులు సహకరించి ఎక్కడైనా తడిచిన ధాన్యం ఉంటే ఆరబెట్టి విక్రయించాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మిల్లర్లకు తగు సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. గోనె సంచులు, రవాణాకు వాహనాలు, హమాలీలను సిద్ధంగా ఉంచామని తెలిపారు.

చలికాలం సర్దుబా(పో)టు..!

కరెంటు బిల్లుల భారం జనాలకు తెలియకుండా ప్రభుత్వం కుయుక్తులు పన్నింది. చలికాలం విద్యుత్ వినియోగం తక్కువగా ఉన్న సమయంలో సర్దుబాటు భారాలకు పూనుకుంది. ప్రస్తుతం డిసెంబర్‌లో వచ్చిన బిల్లును పరిశీలిస్తే అసలు విషయం అర్థమవుతోంది. విద్యుత్ వినయోగం తగ్గినా కరెంటు బిల్లులు ఎక్కువగా రావడానికి కారణం ఇదే. ప్రస్తుత కరెంటు బిల్లులో ఎఫ్‌పిపిసిఎ (ఫుల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్టమెంట్) ఛార్జీలు రెండు కనిపిస్తాయి. ఇక ఇతర ఛార్జీలు షరా మామూలే. వాడుకున్న కరెంటు కంటే అదనపు ఛార్జీల భారమే మోత మోగుతోంది. దీంతో చిరువ్యాపారులు, గృహ వినియోగదారులు లబోదిబోమంటున్న పరిస్థితి.

- జనం నుంచి వ్యతిరేకత రాకుండా ప్రభుత్వం కుయుక్తులు
- చలికాలంలో విద్యుత్ వినియోగం తగ్గినా బిల్లులు తగ్గని పరిస్థితి
- అదనపు ఛార్జీల పేరుతో కరెంటు బిల్లులు షాక్
- ఎఫ్‌పిపిసిఎ ఛార్జీల ముసుగులో బాదుడే బాదుడు
- ప్రస్తుత బిల్లులో రెండు ఎఫ్‌పిపిసిఎ ఛార్జీలు
- చిరు వ్యాపారులు, గృహ వినియోగదారులు విలవిల

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వైసిపి ప్రభుత్వం పోయి టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలవుతోంది. గత ప్రభుత్వం అనుసరించిన విధానాలకు, ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు ఏమాత్రం తేడా లేదు. గడిచిన ఐదేళ్ల పాలనలో ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల పేరుతో వైసిపి దాదాపు తొమ్మిదిసార్లు జనాలపై కరెంటు ఛార్జీల భారం మోపగా, కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే రెండుసార్లు కరెంటు భారాలు మోపింది. డిసెంబర్‌లో తీసిన కరెంటు బిల్లుల్లో ఇప్పటికే ఒక ఛార్జీ పడగా, జనవరి నుంచి మరో అదనపు ఛార్జీ జత కానుంది. అదనపు ఛార్జీల భారంపై జనాల నుంచి వ్యతిరేకత రాకుండా ఉండేందుకు ప్రభుత్వం కుయుక్తులతో ముందుకు సాగుతోంది. చలికాలం విద్యుత్ వినియోగం తక్కువగా ఉంటుంది. దీంతో కరెంటు బిల్లు తక్కువగా రావాలి. ఎక్కడా అటువంటి పరిస్థితి లేదు. గత బిల్లుకంటే కొంతమందికి ఎక్కువగా రాగా, మరికొంత మందికి గత బిల్లుకంటే కొద్దిమొత్తం తేడాలో కరెంటు బిల్లులు వచ్చాయి. కరెంటు ఎక్కువగా వాడకపోవడంతో భారీగా బిల్లులు తగ్గుతాయని భావించిన జనాలకు ఏమాత్రం ఊరట లేకపోయింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 12 లక్షల గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. పెద్దఎత్తున చిరు వ్యాపారులు ఉన్నారు. వీరంతా డిసెంబర్ రెండో తేదీ నుంచి తీస్తున్న కరెంటు బిల్లులు చూసి తలలు పట్టుకుంటున్నారు. విద్యుత్ వినియోగం తగ్గినా బిల్లులు పెద్దఎత్తున ఎందుకు వచ్చాయో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుతం వస్తున్న విద్యుత్ బిల్లును పరిశీలనగా చూస్తే అసలు విషయం అర్థమవుతోంది.



జిరాక్స్ షాపుకు గత నెలలో రూ.1,638 కరెంటు బిల్లురాగా, ఈ నెల రూ.1972 వచ్చిన బిల్లులు

2021-22కు సంబంధించిన సర్దుబాటు భారం ఎఫ్‌పిపిసిఎ2 పేరుతో కరెంటు బిల్లులో భారం కన్పిస్తోంది. 2022-23కు సంబంధించిన సర్దుబాటు భారం డిసెంబర్ బిల్లులో ఎఫ్‌పిపిసిఎ పేరుతో మరో భారం మోపారు. ఇవికాకుండా డిమాండ్ ఛార్జీ, కస్టమర్ ఛార్జీ, ఇడి వంటి ఛార్జీలు వేశారు. దీంతో విద్యుత్ వాడకం తగ్గినా కరెంటు బిల్లు మాత్రం తగ్గలేదు. దీంతో ఏలూరులోని ఓ జిరాక్స్ షాపునకు గత నెలకంటే బిల్లు అదనంగా రావడంతో సదరు యాజమాని తల పట్టుకుంటున్నాడు. ఆ షాపునకు బిల్లు మొత్తం రూ.1972 రాగా అందులో అదనపు ఛార్జీల భారం రూ.875 వరకూ ఉంది. చిరువ్యాపారులకు సంబంధించిన ఏ బిల్లు చూసినా ఇదే పరిస్థితి ఉంది. గృహ వినియోగదారుల పరిస్థితి ఇదేవిధంగా ఉంది. చాలామందికి ప్రభుత్వం చేస్తున్న కుట్ర అర్థంకాని పరిస్థితి. ఎఫ్‌పిపిసిఎ పేరుతో మోపుతున్న భారం గురించి చాలామంది జనాలకు తెలియడం లేదు. తాము అధికారంలోకి వస్తే కరెంటు ఛార్జీలు పెంచబోమని కూటమి పార్టీలు చెప్పాయి. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే జనాలపై భారం మోపింది. దీంతో కరెంటు ఛార్జీల నుంచి అన్నింటి ధరలూ పెరిగిపోవడంతో ఒక కాపీ జిరాక్స్‌కు రూ.మూడు వసూలు చేయడంతో ప్రజలపై పెనుభారం పడుతోంది. హోటల్స్, ఇతర వస్తువులు విక్రయించే దుకాణాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

గత బిల్లుకంటే ఎక్కువగా వచ్చింది


జిరాక్స్ వ్యాపారి, ఏలూరు

మాది జిరాక్స్ షాపు. కమర్షియల్ కేటగిరీలో విద్యుత్ కనెక్షన్ ఉంది. గత నెలలో రూ.1638 కరెంటు బిల్లు వచ్చింది. ఈ నెల ఎసి వంటివి ఏమీ వాడకపోయినా రూ.1972 కరెంటు బిల్లు వచ్చింది. శీతకాలం బిల్లు తగ్గాల్సి ఉండగా పెరిగింది. ఇంత పెద్దమొత్తంలో అదనపు ఛార్జీలు వేస్తే వ్యాపారాలు ఏవిధంగా చేయాలో అర్థం కావడం లేదు.

ఎఫ్‌పిపిసిఎ భారం ఒక్కటే రూ.218

గృహ వినియోగదారుడు

ఈ నెల కరెంటు బిల్లు రూ.1100 వచ్చింది. అందులో ఎఫ్‌పిపిసిఎ భారం రూ.218 వచ్చింది. ఇక ఫిక్స్‌డ్, కస్టమర్ ఛార్జీలు, ఇడి, సర్‌ఛార్జీల కింద రూ.115 వరకూ పడ్డాయి. దాదాపు రూ.330కుపైగా అదనపు భారం బిల్లులో రావడం జరిగింది. ఇలాగైతే మాలాంటి సామాన్య ప్రజానీకం ఎలా బతకాలో ప్రభుత్వమే చెప్పాలి.



మాట్లాడుతున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

ఉద్యమాలే ఊపిరి

- మరోసారి విశిష్టతను చాటుకున్న పిడిఎఫ్
- గెలిచిన తెల్లారే సిపిఎస్ ఉద్యమంలోకి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, ప్రజా సమస్యలపై పోరాటాలే తమ ఊపిరి అని పిడిఎఫ్ ఎంఎల్‌సిలు మరోసారి చాటుకున్నారు. ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా గెలుపొందిన పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి సోమవారం సాయంత్రం ఎన్నిక ధ్రువీకరణపత్రాన్ని అందుకున్న 24 గంటలు గడవక ముందే సిపిఎస్ ఉద్యమంలో భాగస్వాములై పిడిఎఫ్ విశిష్టతను చాటారు. విజయవాడలో ఎపి సిపిఎస్ఇఎ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన సిపిఎస్ వ్యతిరేక ఉద్యమంలో ఆయన ప్రత్యక్షంగా పాల్గొని ఉద్యోగ, ఉపాధ్యాయులకు అండగా నిలబడ్డారు. సాధారణంగా ఎంఎల్‌సి, ఎంఎల్‌ఎగా గెలిచిన వెంటనే అలసిపోయామంటూ రిలాక్స్ అవుతుంటారు. లేకపోతే సేద తీరేందుకు వేరే ప్రాంతానికి వెళ్తుంటారు. అయితే పిడిఎఫ్ ఎంఎల్‌సి గోపీమూర్తి మాత్రం దానికి భిన్నంగా ఉద్యమంలో పాలుపంచుకోవడం విశేషం. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ సిపిఎస్ రద్దు కోసం ఆది నుంచి పోరాటం చేస్తున్నామని, ఇది రద్దయే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులను ఒకే తాటిపైకి తీసుకొచ్చి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు.

బాగా చదువుకోవాలి

విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీల్లో కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

విభిన్న ప్రతిభావంతులు ఉన్నతంగా చదువుకుని జీవితంలో స్థిరపడేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక డిఎన్ఆర్ కళాశాలలో విభిన్న ప్రతిభావంతులకు ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి క్రీడా పోటీలను ఆమె జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు ఎవరికీ తీసిపోని విధంగా పారా ఒలంపిక్స్‌లో సైతం అనేక మెడల్స్‌ను సాధిస్తున్నారన్నారు. ఇదే స్ఫూర్తితో జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడలతోపాటు చదువు చాలా ముఖ్యమని, విభిన్న ప్రతిభావంతులు ప్రతిఒక్కరూ తప్పక చదువుకునేలా సంబంధిత సంఘాలు, అధికారులు కృషి చేయాలన్నారు. వీరి కోసం జిల్లాలోని 20 మండలాల్లో భవిత కేంద్రాలను ఏర్పాటు చేశామని, విభిన్న ప్రతిభావంతులను భవిత సెంటర్లో చేర్చి అక్కడ అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలని అన్నారు. బాగా చదువుకుంటేనే వారిలో ఆత్మ స్థయిర్యం పెరుగుతుందని, వారి కాళ్లపై వారు నిలబడే స్థాయికి చేరుకుంటారని తెలిపారు. ప్రతిఒక్క విభిన్న ప్రతిభావంతుడు తప్పక చదువుకోవాలని, ప్రత్యేక అవసరాలు కలిగి ఉండి ఉన్నత స్థానాలకు ఎదిగిన వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని ఈ సందర్భంగా హితవు పలికారు. ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడంతోపాటు వారి అవసరాలకు అనుగుణంగా ఏర్పాట్లను చేస్తున్నామని తెలిపారు. సాధారణ ప్రజలకే ఎన్నో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్న ఈ తరుణంలో విభిన్న ప్రతిభావంతుల అవసరాల మేరకు ప్రత్యేక వైద్య సదుపాయాలను అందజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పలు అసోసియేషన్ల ప్రెసిడెంట్లు విజ్ఞాపనల మేరకు ప్రతి మూడు నెలలకోసారి ప్రత్యేక వికలాంగుల గ్రీవెన్స్ నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ, ఏలూరుకు సంబంధించిన సిబ్బంది కొందరిని భీమవరంలో విధులు నిర్వహించేలా ఆదేశిస్తామని, అలాగే కమ్యూనిటీ హాలు నిర్మాణానికి పరిశీలిస్తామని చెప్పారు. శారీరక వైకల్యం కలిగిన వారికి మూడు చక్రాల రిక్షా రేస్, జావెలిన్ త్రో, షాట్‌పుట్ పోటీలు, దృష్టి లోపం కలిగిన వారికి పరుగుపందెం, షాట్‌పుట్, క్రికెట్ (సీనియర్స్), బధిరులు (మూగ) వారికి పరుగుపందెం, షాట్‌పుట్, క్యారమ్స్, మానసిక వైకల్యం కలిగిన వారికి పరుగుపందెం, సాఫ్ట్‌బాల్, డిస్కస్ త్రో తదితర క్రీడలను నిర్వహించామన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి ఆధ్వర్యంలో అల్పాహారాన్ని, డిఎన్ఆర్ కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్‌కుమార్, ఎస్ఎస్ఎ పిఒ శ్యాంసుందర్, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, డిఎన్ఆర్ కళాశాల ప్రెసిడెంట్ జి.నరసింహరాజు, సెక్రటరీ గాదిరాజు బాబు, విజువల్లీ హ్యాండీక్యాప్డ్ ప్రెసిడెంట్ బి.వెంకట రామారావు, ఆర్థోపెటిక్ హ్యాండీక్యాప్డ్ ప్రెసిడెంట్ ఎ.నటరాజ్, హియరింగ్ హ్యాండీక్యాప్డ్ ప్రెసిడెంట్ టి.రాము, స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సిహెచ్.తాతారావు, స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు టి.త్రిమూర్తులు, వి.లక్ష్మణ్, కె.సురేష్, సిహెచ్.వాసు పాల్గొన్నారు.



ఆటల పోటీలు ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి

జీవితంలో సమయ పాలన ముఖ్యం

నిండు గర్భిణిగా గ్రూప్-1 పరీక్షలు రాశా : నరసాపురం డిఎస్‌పి డాక్టర్ శ్రీవేద

ప్రజాశక్తి - పాలకొల్లు

జీవితంలో సమయ పాలన పాటిస్తూ దృఢ సంకల్పంతో ముందుకు సాగాలని నరసాపురం డిఎస్‌పి డాక్టర్ శ్రీవేద కోరారు. స్థానిక డిఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం నూతన విద్యార్థినుల పరిచయ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తాను నిండు గర్భిణిగా ఉండి గ్రూప్-1 పరీక్ష రాసి ఉత్తీర్ణులురాలయ్యానని, తన కుటుంబ సభ్యుల ప్రోత్సాహం వల్లే ఇది సాధ్యమైందని అన్నారు. తాను ఒక డెంటల్ డాక్టర్ అని, కూచిపూడి, భరతనాట్యం కూడా తనకు వచ్చని చెప్పారు. రాజోలు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సాయిబాబు మాట్లాడుతూ సృష్టిని, పరిసరాలను పరిశీలిస్తూ, విలువలను, క్రమశిక్షణను అలవర్చుకోవాలన్నారు. నారాయణపురం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నిర్మల మాట్లాడుతూ సోషల్ మీడియా ద్వారా ఎంతోమంది స్నేహితులు పరిచయమవుతున్నారని, వారితో చాటింగ్ చేసే సమయాన్ని తగ్గించుకుని చదువుకు ఎక్కువ సమయాన్ని కేటాయించాలని అన్నారు. కోకోనట్ కళాశాల ప్రిన్సిపల్ అప్పారావు మాట్లాడుతూ తాను చదువుకునే రోజుల్లో ఇంగ్లీష్‌లో తక్కువ మార్కులు వచ్చేవని, గురువుల ప్రోత్సాహంతో ఇంగ్లీష్ లెక్చరర్ అయ్యానని తన అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ శోభారాణి, సిపిడిసి సభ్యులు, బారిస్టర్, నారాయణరావు, శేషగిరిరావు, మైథిలి పాల్గొన్నారు. విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



మాట్లాడుతున్న నరసాపురం డిఎస్‌పి శ్రీవేద

కేంద్రీయ విద్యాసంస్థలతో ఎపి నిట్ ఎంఒయు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విశాఖపట్నానికి చెందిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం), మణిపూర్, రాయపూర్ (చత్తీస్‌గఢ్)లోని ఎన్ఐటి వంటి మూడు కేంద్రీయ విద్యా సంస్థలతో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఎపి నిట్) మంగళవారం అవగాహనా ఒప్పందం (ఎంఒయు) చేసుకుంది. ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్‌వి.రమణారావు, ఐఐఎం డైరెక్టర్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్, మణిపూర్ నిట్ డైరెక్టర్ డాక్టర్ డివిఎల్‌ఎన్.సోమయాజులు దస్త్రాలపై సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ రమణారావు మాట్లాడుతూ ఎపి నిట్ విద్యార్థుల భాగస్వామ్యాన్ని మరింతగా పెంచాలనే ఉద్దేశంతో మూడు కేంద్రీయ విద్యాసంస్థలతో అవగాహనా ఒప్పందాలు చేసుకున్నామని తెలిపారు. ఆచార్యులు, పరిశోధనా విద్యార్థులు సంయుక్తంగా కలిసి పని చేయడానికి, ప్రాజెక్టులకు సంబంధించిన పరికరాలను ఇరువురు ఉపయోగించుకునేందుకు, జాతీయ విద్యావిధానం 2020ని అమలు చేయడానికి ఈ ఒప్పందాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. ఐఐఎం విశాఖపట్నం ఎంఒయు ద్వారా బిటెక్ చదువుతున్న మూడు, నాలుగు సంవత్సరాల విద్యార్థులతోపాటు డిప్లమో ఇన్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సులు చేస్తున్న విద్యార్థులకూ ఎంతో ఉపయోగకరమన్నారు. సంస్థలో చదువుకుంటున్న విద్యార్థుల పరిశోధనలు, ఇంటర్న్‌షిప్, ప్రాంగణ ఎంపికలు, ప్రాజెక్టుల అభివృద్ధి నిమిత్తం ఇప్పటి వరకు పలు కంపెనీలు, విద్యాసంస్థలతో కలిపి మొత్తం 29 అవగాహనా ఒప్పందాలు చేసుకోగా, తాజాగా చేసుకున్న ఒప్పందాలతో ఆ సంఖ్య 32కు చేరుకుందని వివరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్‌లు డాక్టర్ జిఆర్‌కె.శాస్త్రి, డాక్టర్ టి.కురుమయ్య, డాక్టర్ జిబి.వీరేష్‌కుమార్, డాక్టర్ ఎన్.జయరామ్, అసోసియేట్ డీన్ డాక్టర్ వి.సందీప్ తదితరులు పాల్గొన్నారు.



ఒప్పందాలు పరస్పరం మార్చుకుంటున్న డైరెక్టర్లు

ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - పెనుమంట్ర

కల్లాల్లోని ధాన్యాన్ని గుర్తించి రైతు సేవా కేంద్రాల ద్వారా వెంటనే కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు తరలించాలని సంబంధిత అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి మండలంలో రైతుసేవా కేంద్రం-2 పరిధిలో పర్యటించారు. పెనుమంట్ర, వెలగలవారిపాలెం గ్రామాల రైతులతో మాట్లాడారు. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని, కాటాలో తూకం వేస్తున్న ధాన్యం బస్తాలను పరిశీలించారు. మండలంలో ప్రొక్యూర్మెంట్ ఎంతవరకు జరిగింది, ఇంకా జరగాల్సింది ఎంత ఉంది అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో 12,156 ఎకరాల్లో వరి సాగు చేయగా 8,149 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయని, ఇంకా సుమారు నాలుగు ఎకరాలకుపైగా కోతలు కోయాల్సి ఉన్నాయని తెలిపారు. 24,462 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకూ 14,106 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని రైతుసేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేశామని తెలిపారు. కల్లాల్లో సిద్ధంగా ఉన్న 2,500 మెట్రిక్ టన్నుల ధాన్యం గుర్తించామని, వెంటనే రైతుసేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు తరలించామని తహశీల్దార్ వై.రవికుమార్, మండల వ్యవసాయాధికారి ఎ.జ్యోషిల జెసి టి.రాహుల్‌కుమార్‌రెడ్డికి వివరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ వాతావరణం అనుకూలంగా లేనందున రైతులతో మాట్లాడి వెంటనే రైస్‌మిల్లులకు ధాన్యాన్ని తరలించాలన్నారు. రైస్‌మిల్లుల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గోనె సంచుల కొరత లేకుండా చూడాలన్నారు. 80 వేల గోనె సంచులను పాలకొల్లు రైస్‌మిల్లర్ల నుండి మండలానికి పంపామని చెప్పారు. వెంటనే కల్లాల్లోని ధాన్యాన్ని సేకరించి మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యం కొనుగోలు మరింత వేగవంతం చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు విజయవంతం చేయాలన్నారు. రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోపే రైతు ఖాతాల్లో డబ్బులు జమ చేయడం సంతోషంగా ఉందని పలువురు రైతులు జాయింట్ కలెక్టర్ వద్ద ఆనందం వ్యక్తం చేశారు.

పెనుగొండ: రైతులు దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు సూచించారు. మంగళవారం చెరుకువాడలో ధాన్యాన్ని పరిశీలించారు. చిరిగిపోయిన సంచుల వల్ల ఇబ్బందులు పడుతున్నామని, కాటా వేయకుండా వేబ్రిడ్జ్ కాటాతో తూకం వేసి ధాన్యం రైస్‌మిల్లర్లకు పంపుతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొంతమంది రైతులైతే దళారుల చేతిలో పడి రూ.1380 నుండి రూ.1450కే అమ్ముకుని మోసపోయారన్నారు. మండల వ్యవసాయాధికారి స్పందన మాట్లాడారు.



పెనుమంట్ర : రైతులతో మాట్లాడుతున్న జెసి

బుర్రకథ కళాకారుడు కన్నుమూత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక వీకర్స్ కాలనీకి చెందిన ప్రముఖ బుర్రకథ కళాకారుడు యడవల్లి దుర్గాప్రసాద్ (60) తన స్వగృహంలో మంగళవారం గుండెపోటుతో కన్నుమూశారు. చిన్ననాటి నుంచి ఆయన బుర్రకథలు ప్రదర్శించేవారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వేలాది ప్రదర్శనలు ఇచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాలస్థాయి బుర్రకథ పోటీల్లో ఆయన బృందం రెండుసార్లు ఉత్తమ బహుమతిని గెలుచుకుంది. బుర్రకథల్లో ఉత్తమ రాజకీయ కథకునిగా ఒకసారి ప్రథమ బహుమతిని గెలుచుకున్నారు. సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో టీవీ, ఆకాశవాణి ప్రథమ శ్రేణి కళాకారునిగా ఆయన కొనసాగుతున్నారు. ఆకాశవాణి, దూరదర్శన్‌ల్లో అనేకసార్లు ఆయన కళా ప్రదర్శనలు ఇచ్చారు. భక్తిరంజని గాయకులగాను, తబలా కళాకారునిగాను ఆయన అనేక ప్రదర్శనలు ఇచ్చారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. కుమారుడు శివకుమార్ భక్తి రంజని గాయకునిగా ప్రసిద్ధి చెందారు. దుర్గాప్రసాద్ మృతి పట్ల రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సూరంపూడి వెంకటరమణ సంతాపం వ్యక్తం చేశారు. ప్రధాన కార్యదర్శి చింతకాయల వంశీకృష్ణ, కోశాధికారి మాస బాబురావు, మాజీ కోశాధికారి తగరంపూడి మురళీకృష్ణ దుర్గాప్రసాద్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.



దుర్గాప్రసాద్ (ఫైల్‌ఫొటో)

గుండెపోటుతో సిపిఎం నేత నాగేశ్వరరావు మృతి

తాడేపల్లిగూడెం: సిపిఎం తాడేపల్లిగూడెం రూరల్ మండల కమిటీ సభ్యులు, బంగారుగూడెం గ్రామ శాఖా కార్యదర్శి సిద్ధాబత్తుల నాగేశ్వరరావు (56) మంగళవారం తెల్లవారుజామున కాకినాడ ఆస్పత్రిలో గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల సిపిఎం రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు మంతెన సీతారాం, సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా సెక్రటేరియట్ సభ్యులు చింతకాయల బాబూరావు, మండల నాయకులు కండేల్లి సోమరాజు, మండల కన్వీనర్ పాలుపూరి సత్యనారాయణ మంగళవారం ఉదయం బంగారుగూడెంలోని ఆయన నివాసానికి వెళ్లి భౌతికకాయంపై ఎర్రజెండా కప్పి జోహార్లు అర్పించారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ నాగేశ్వరరావు మృతి సిపిఎం ఉద్యమాలకు తీరని లోటని, వారి కుటుంబ సభ్యులకు పార్టీ జిల్లా కమిటీ తరుపున సానుభూతి తెలిపారు. నాగేశ్వరరావు ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తూ తమ గ్రామంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారని తెలిపారు. రానున్న రోజుల్లో శాఖా సభ్యులు ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం గ్రామ శాఖా సభ్యులు పాల్గొన్నారు.



నాగేశ్వరరావు (ఫైల్‌ఫొటో)

గోపీమూర్తి విజయంతో యుటిఎఫ్ సంబరాలు

కాళ్ల: ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా బొర్రా గోపీమూర్తి గెలుపుతో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు గెలుపు సంబరాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నేతలు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నికలో ప్రొగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ అభ్యర్థిగా యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం బలపర్చిన బొర్రా గోపీమూర్తిని అఖండ మెజార్టీతో గెలిపించిన ఉపాధ్యాయులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. బొర్రా గోపీమూర్తి అఖండ విజయం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు హృదయపూర్వక అభినందనలు తెలుపుతూ స్వీట్లు పంపిణీ చేశారు. వారిలో యుటిఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బిఆర్‌ఎంకె.స్వామి, ఎం.శంకర్రావు, జిల్లా కార్యదర్శి, మండల ఇన్‌ఛార్జి జి.రామకృష్ణంరాజు, మండల గౌరవాధ్యక్షులు వి.రవికుమార్రాజు, మండల సహాధ్యక్షులు పి.ప్రభుదాసు, మండల మహిళా సహాధ్యక్షురాలు డి.కనకదుర్గ, జిల్లా కౌన్సిలర్ కె.రవిచంద్రకుమార్ ఉన్నారు.



సంబరాలు చేసుకుంటున్న యుటిఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు

ఎస్‌కెఎస్‌డి విద్యార్థినుల హవా

ప్రజాశక్తి - తణుకు

నెహ్రూ యువకేంద్రం వారు వైఎన్ కళాశాల నరసాపురంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువ ఉత్సవ్‌లో భాగంగా పలు పోటీల్లో తణుకులోని ఎస్‌కెఎస్‌డి యుజి, పిజి (అటానమస్) విద్యార్థినులు పాల్గొని రెండు ప్రథమ, రెండు ద్వితీయ, రెండు తృతీయ స్థానాలు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యు.లక్ష్మీసుందరీబాయ్ తెలిపారు. ఈ సందర్భంగా సుందరీబాయ్ మాట్లాడుతూ వారు గెలుపొందడంతో పాటు రూ.26,500 నగదు బహుమతి కైవశం చేసుకున్నారని తెలిపారు. విజేతలను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, కె.పద్మజారాణి, సిహెచ్.రమేష్‌బాబు, కెవి.శ్యామలాదేవి, వి.తులసీరత్నం అభినందించారు.

విత్తన కంపెనీలు నష్టపరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

నకిలీ వరి విత్తనాలు విక్రయించి రైతులను మోసగించిన కంపెనీల యాజమాన్యాలు తక్షణం నష్ట పరిహారం చెల్లించాలని కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. మాముడూరులోని బొక్కావారి పాలెం, చిట్టిమట్లగురువు ప్రాంతంలో కౌలు రైతులు, సన్న కారు రైతులు 44 మంది రైతులు మాముడూరు రైతు భరోసా ద్వారా సార్వాలో 96 ఎకరాల్లో స్వర్ణ వరి విత్తనాలు, ఆకు మడులు వేశారన్నారు. పంట కోతకొచ్చే సమయానికి స్వర్ణ విత్తనాల్లో మూడు రకాలు తెలుపు, నలుపు దుబ్బు మీసాలు వచ్చి కేలి రకం విత్తనాలు ఉన్నాయని అన్నారు. మంగళవాం గోపాలన్ ప్రత్యక్షంగా పంట పొలాలను పరిశీలించారు. స్థానిక రైతులు బొక్కా రామారావు, పెచ్చెట్టి సత్యనారాయణ, గూడూరి చిరంజీవి మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు మూడు దఫాలుగా గ్రామం వచ్చారని, విత్తనాలు అమ్మిన వారిపై చర్య తీసుకుని నష్టపరిహారం ఇప్పిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటి వరకూ చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గోపాలన్ మాట్లాడుతూ రైతులను మోసం చేసిన విత్తన కంపెనీదారులపై చర్యలు తీసుకుని, ఎకరానికి రైతుకు నష్టపరిహారంగా 30 వేల రూపాయలు విత్తన కంపెనీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సిఐటియు నాయకులు కె.ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థికి వినికిడి యంత్రం అందజేత

ప్రజాశక్తి - భీమవరం

ఈనెల ఏడో తేదీన తణుకు జెడ్‌పిహెచ్‌ఎస్ బాయ్స్ పాఠశాలలో నిర్వహించిన పేరెంట్ టీచర్ ఆత్మీయ సమావేశానికి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంలో పదో తరగతి విద్యార్థి బి.రామ్‌చరణ్ వినికిడి సమస్యతో బాధపడుతున్నాడని, వినికిడి యంత్రం అవసరమని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే విభిన్న ప్రతిభావంతుల కార్యాలయానికి మాట్లాడి వినికిడి యంత్రాన్ని తెప్పించి జెసి రామ్ చరణ్‌కు అందజేశారు. బాగా చదివి పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు.

భరత్‌కు సేవా పురస్కారం

ప్రజాశక్తి - పెనుమంట్ర

అంబేద్కర్ ఆలోచనా వేదిక జాతీయ నాయకులు స్థానిక సామాజిక సేవకుడు చవ్వాకుల భరత్ అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్, కాకినాడ వారి ఆధ్వర్యంలో సేవా పురస్కారం అందుకున్నారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయనకు హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధులు ఈ అవార్డు అందించి సేవలను కొనియాడారు. భరత్‌కు ఈ అవార్డు రావడం పట్ల పలువురు స్థానిక సేవా సంస్థల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

సతీష్ ఎంపిక పట్ల జోగయ్య హర్షం

ప్రజాశక్తి - పాలకొల్లు

టిడిపి నుంచి మిత్రుడు సానా సతీష్ రాజ్యసభకు ఎన్నికైన నేపథ్యంలో కాపు, బలిజ సంక్షేమ సేన అధ్యక్షుడు చేగొండి హరరామ జోగయ్య మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆయన సారధ్యంలో కాపుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రోగులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - పాలకొల్లు

హ్యూమన్ రైట్స్ నేషనల్ డే సందర్భంగా యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పాలకొల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద బెడ్‌షీట్లు, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పాలకొల్లు పట్టణ సిఐ రజనీకుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గవర్నర్ పెనుమాక రామ్మోహనరావు, అధ్యక్ష కార్యదర్శులు జక్కంపూడి మదన్, వేరుకొండ దుర్గాప్రసాద్, కోశాధికారి సిరిగినీడి నాగార్జున, వ్యవస్థాపకులు పోకల రాము, గుండుమొగుల వీరాస్వామి, ఇనుకొండ శేషాద్రి, పస్యావుల రవి, యర్రంశెట్టి వెంకట రత్నం, కర్రా నరసింహారావు, సాయి, సత్తినీడి రాజా, ఏసుపాదం పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరంలో నాలుగు సచివాలయాల పరిధిలో గర్భిణులకు ప్రతినెలా 9, 10 తేదీల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పిహెచ్‌సి డాక్టర్ పి.కిరణ్మయి తెలిపారు. మంగళవారం స్థానిక పిహెచ్‌సిలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గర్భిణులు తప్పనిసరిగా నాలుగు సార్లు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఐరన్, కాల్షియం మాత్రలు వాడాలన్నారు. మొత్తం 76 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. సిహెచ్‌ఒ జాలాది విల్సన్‌బాబు మాట్లాడుతూ వైద్యుల సూచనలను పాటించి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ వి.పద్మజ, స్టేఫ్ నర్సు డి.శ్రీరామమణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని పది రహదారులకు అత్యవసర మరమ్మతుల నిమిత్తం ప్రభుత్వం రూ.75 లక్షల నిధులు మంజూరు చేసిందని ఆర్‌అండ్‌బి జెఇ కెటి.ప్రసన్నబాబు తెలిపారు. యలమంచిలి మండలంలోని 5 రోడ్ల నిర్మాణానికి రూ.33 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. టెండర్ల పక్రియ అనంతరం రహదారులకు మరమ్మతులు చేపడతామని ఆయన తెలిపారు.

ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనే సామాజిక బాధ్యత

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనే సామాజిక బాధ్యత అని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వరరావు, సంఘం సేవకులు చెరుకువాడ రంగసాయి అన్నారు. మంగళవారం భీమవరం ఎఆర్‌కెఆర్ మున్సిపల్ హైస్కూల్లో భీమవరం పురపాలక సంఘం, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన సదస్సు, ప్రచార ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడారు. ప్లాస్టిక్ నిర్మూలన సామాజిక బాధ్యతగా ప్రతిఒక్కరూ తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తామని ప్రతిజ్ఞ నిర్వహించి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం.సత్యనారాయణ మూర్తి, ఉపాధ్యాయులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఆచంట: ఆచంట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జి మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ సమావేశానికి ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి అధ్యక్షత వహిస్తారని తెలిపారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు విధిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నాగబాబుకు నాయకర్ అభినందన

నరసాపురం: జనసేన రాష్ట్ర నాయకులు నాగబాబుకు మంగళవారం గన్నవరం ఎయిర్ పోర్టులో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అభినందనలు తెలిపారు. నాగబాబుకు త్వరలో కేబినెట్లో చోటు కల్పిస్తున్నారన్న సమాచారంతో తీర ప్రాంతం నుంచి జనసేనకులు నాయకర్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున్న తరలివెళ్లారు. ఎయిర్ పోర్టులో నాగబాబుకి నాయకర్ కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో వలవల నాని, రావూరి సురేష్, గంట కృష్ణ మార్రాజు, జి దుర్గాప్రసాద్, గ్రంధి నాని, గుబ్బల మర్రాజు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

నరసాపురం లేస్‌కు మరింత వన్నె తేవాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

లేస్‌కు మరింత వన్నె తెచ్చేదిశగా అవసరమైన అన్ని చర్యలూ చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ నాగరాణిని న్యూఢిల్లీ నుండి వచ్చిన ప్రత్యేక బృందం ఆంధ్రప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.విశ్వ ఆధ్వర్యంలో కలుసుకుని లేస్ ఉత్పత్తులపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లేస్ అల్లికల్లో నూతన డిజైన్లను తయారు చేయడానికి అల్లికదారులకు సూచించినట్లు తెలిపారు. డల్ కలర్స్‌తో కాకుండా బ్రైట్ కలర్స్‌తో లేసు అల్లికలను మరింత ఆకర్షణీయంగా తయారు చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. డిఆర్‌డిఎ కృషితో ఇటీవల



కేంద్ర బృందంతో మాట్లాడుతున్న కలెక్టర్

నరసాపురం లేసుకు జిఐ గుర్తింపు లభించిందని, న్యూఢిల్లీలో సర్టిఫికెట్‌ను కేంద్ర మంత్రి చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రోడక్ట్ సంబంధించి దేశవ్యాప్తంగా 600 ఉత్పత్తులు పోటీపడగా 40 ఉత్పత్తులను గుర్తించడం జరిగిందని, వాటిలో పది ఉత్పత్తులు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నాయన్నారు. వీటన్నింటిలో కంటే లేసు ఉత్పత్తులకు ప్రత్యేక గుర్తింపు లభించిందని కేంద్ర బృందానికి వివరించారు. అనంతరం కేంద్ర బృందం నరసాపురం లేసి పార్క్‌ను సందర్శించి, ఎంత అమ్మకాలు చేస్తున్నారు, మార్కెటింగ్ ఎలా ఉంది, ఏ వెబ్‌సైట్‌లో ఉంచుతున్నారు, రుణ సౌకర్యం, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎపి హెచ్‌డిసి విసి అండ్ ఎండి ఎం.విశ్వ, కేంద్ర బృందం జాస్మిన్ కౌర్, నచ్చికత మిట్టల్, డిఆర్‌డిఎ పిడి ఎంఎస్‌ఎస్ వేణుగోపాల్, జిల్లా హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ అధికారి కె.అప్పారావు, గౌతమ్ ఉన్నారు.

పని ప్రదేశంలో మహిళలను వేధింపులకు గురిచేస్తే చర్యలు

ప్రజాశక్తి - తణుకు

స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలైనా సమాజంలో నేటికీ మహిళలు, వృద్ధులు, బాలికలపై లైంగిక వేధింపులు, దాడులు, హత్యలు జరుగుతున్నాయని జిల్లా స్త్రీ, శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సుజాతారాణి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల చట్టంపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సుజాతారాణి మాట్లాడుతూ పని ప్రదేశంలో స్త్రీలపై లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా 2013లో చట్టం చేశారన్నారు. ఎవరైనా పని ప్రదేశంలో లైంగిక వేధింపులకు గురైతే మూడు నెలల్లోగా సెక్సువల్ హెరేజ్‌మెంట్ కమిటీకి ఫిర్యాదు చేయాలన్నారు. ఎసిడిపిఒ ఆశా రోహిణి మాట్లాడుతూ బాల్య



పెనుమంట్ర : మాట్లాడుతున్న కృష్ణకుమారి

వివాహాలు జరగకుండా చూడాలని, బాల్య వివాహాలు జరగడం వల్ల ఆడపిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. సిడిపిఒ ప్రమోదినీకుమారి మాట్లాడుతూ గల్ఫ్ వెళ్లే తల్లిదండ్రులు తమ పిల్లలపై ఎక్కువగా శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షణాధికారులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : మహిళలను పని ప్రదేశంలో లైంగికంగా వేధించే వారిని శిక్షించడానికి కఠిన చట్టాలు వచ్చాయని ఐసిడిఎస్ పెనుమంట్ర ప్రాజెక్టు అధికారి అంగర కృష్ణకుమారి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పని ప్రదేశంలో లైంగిక వేధింపులు - నివారణ, నిషేధం అంశంపై సదస్సు, ర్యాలీ నిర్వహించారు. స్త్రీల పట్ల పూజ్య భావంతో ఉండడం అందరూ అలవాటు చేసుకోవాలన్నారు. చులకనగా చూడడం, వ్యంగ్యంగా మాట్లాడడం చట్ట రీత్యా నేరాలన్నారు. సదస్సు, ర్యాలీలో ప్రాజెక్టు పరిధిలోని ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు జిఎంఎస్‌కెలు, అంగన్వాడీ కార్యకర్తలు, విఒఎలు పాల్గొన్నారు.

అమరావతిలో రెండు రోజులు కలెక్టర్ల సదస్సు

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 11, 12 తేదీల్లో అమరావతిలో జరిగే కలెక్టర్ల సదస్సుకు హాజరుకానున్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హాజరుకానున్నారు. జిల్లాలో అందుబాటులో ఉండరని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని అధికారులు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మించాలని వినతి

ప్రజాశక్తి - తణుకు రూరల్

వేల్పూరులోని శాలిపేటలో పాడైపోయిన సిసి రోడ్డు స్థానే సిమెంటు రోడ్డు నిర్మించాలని కోరుతూ సిపిఎం వేల్పూరు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శి సుంకర రత్న మాలికకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు మాట్లాడుతూ గ్రామంలో దాదాపు ఏడాదిన్నర క్రితం ప్రారంభించిన జల జీవన్ మిషన్ పనుల్లో భాగంగా ఇంటింటికీ ఉచిత కుళాయి ఏర్పాటు కోసం తవ్విన గుంతల కారణంగా పలు చోట్ల సిమెంటు రోడ్డు కుంగిపోయిందన్నారు. దీంతో అటుగా వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందిపడాల్సి వస్తోందన్నారు. పంచాయతీ అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వాసా శ్రీనివాసరావు, శీలబోయిన వెంకట నరసింహారావు, పెన్నాడ నాగభూషణం, పర్వతం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అన్నదానానికి దాట్ల శ్రీదేవి ట్రస్ట్ సాయం

ప్రజాశక్తి - కాళ్ల

అన్న సమారాధనకు దాట్ల శ్రీదేవి ట్రస్టు అధినేత దాట్ల వెంకట రామరాజు సాయం అందించేందుకు ముందుకొచ్చారు. కాళ్లకూరులో మెయిన్ రోడ్డులో ఉన్న చర్చికి క్రిస్మస్ ఆరాధన అన్న సమారాధన నిమిత్తం దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత దాట్ల వెంకటరామరాజు ముందుకొచ్చి నాలుగు బస్తాల బియ్యాన్ని ఆర్‌ఎంపి వైద్యుడు అప్పారావు, దానియేలుకు ట్రస్ట్ సభ్యులు పెన్మెత్స నాగరాజు చేతులమీదుగా మంగళవారం అందజేశారు. అన్న సమారాధనకు వెయ్యి లీటర్ల ఆర్‌ఒ వాటర్ అందించనున్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రత్నం రాజు పాల్గొన్నారు.

మ్యాథ్స్ టాలెంట్ టెస్టులో

ఉల్లంపర్రు విద్యార్థికి స్టేట్ ఫస్ట్ ర్యాంకు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

రామానుజం మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో ఉల్లంపర్రు మాంటిస్సోరీస్ విద్యార్థి ఆంధ్రాతోపాటు తెలంగాణ రెండు రాష్ట్రాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించారు. 5వ తరగతి విద్యార్థి సిహెచ్.ఆశిత్ స్టేట్ ఫస్ట్ ర్యాంకు అని స్కూల్ అడ్మినిస్ట్రేటర్ డైరెక్టర్ మద్దాల వాసు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకమైన రామానుజం మాథ్స్ ట్యాలెంట్ టెస్ట్ వద్ద ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వేల విద్యార్థులు పోటీపడగా ఉల్లంపర్రు మాంటిస్సోరీస్ విద్యార్థి ఆశిత్ 95 శాతం మార్కులతో ఆంధ్రాతోపాటు తెలంగాణ రెండు రాష్ట్రాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించాడని మరోసారి ఉల్లంపర్రు మాంటిస్సోరీస్ ఖ్యాతిని రాష్ట్రంలో నిలిపిన విద్యార్థికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ మద్దాల రాంప్రసాద్, ప్రిన్సిపల్ ఎస్.వసంత లక్ష్మి, వైస్.ప్రిన్సిపల్ సిహెచ్ ఉషాకుమారి అభినందించారు.

భవానీ ప్రసాద్‌కు హ్యూమన్ రైట్స్ అవార్డు

ప్రజాశక్తి - పాలకొల్లు

అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ కాకినాడ వారి ఆధ్వర్యంలో సేవా పురస్కారాల ప్రదానోత్సవం కాకినాడలో మంగళవారం జరిగింది. పాలకొల్లులోని జివిఎస్‌బిఆర్‌ఎం మున్సిపల్ పాఠశాల హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్‌కు హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ ప్రెసిడెంట్ బొడ్డపాటి దాసు సత్కరించి, అవార్డు ప్రదానం చేశారు. సమాజానికి మరిన్ని సేవలు చేయాలని కొనియాడారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా కన్స్యూమర్ జడ్జి రఘుపతి, వసంత కుమార్, జిల్లా గ్రంథాలయం సంస్థ మాజీ ఛైర్మన్ పైడా వెంకట నారాయణ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ధాన్యంలోడ్ ట్రాక్టర్ బోల్తా

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని పెనుమంట్ర నుంచి జుత్తిగ ధాన్యం లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ మార్గమధ్యంలో బోల్తా పడిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. డ్రైవర్ చాకచక్యంతో దూకేయడంతో ప్రాణాపాయ నుంచి బయట పడ్డాడు. చాలా కాలంగా ఈ రోడ్డు అధ్వానంగా ఉందని, అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా రోడ్డుకు మోక్షం లభించలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

గంజాయి విక్రేతలు అరెస్టు

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రభుత్వ లక్ష్యం మేరకు గంజాయి నిర్మూలనకు చట్ట ప్రకారం ప్రత్యేక చర్యలు చేపట్టామని డిఎస్‌పి జి.శ్రీవేద అరవింద అన్నారు. మొగల్తూరులో లిక్విడ్ గంజాయితో పట్టుబడిన పదిమంది నిందితుల వివరాలను మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ నెల 9న ముత్యాలపల్లిలో భోజనం హోటల్ సమీపంలోని ఖాళీ స్థలం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న పది మంది నిందితులను ఎస్ఐ జి.వాసు సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.95,000 విలువగల 138.198 మిల్లీగ్రాముల లిక్విడ్ గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారని డిఎస్‌పి తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు మండలం వెలివెల గ్రామానికి చెందిన పెనుమాల రాంబాబు (45) కుటుంబ కలహాల నేపథ్యంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య కుమారుడు ఉన్నారు.. కుమారుడు రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ బి.సురేంద్రకుమార్ తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి కృషి

జెసి రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం జువ్వలపాలెం రోడ్డులోని పువ్వుల దుకాణాలను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. పువ్వులు కొనేందుకు పువ్వులు అడగ్గా క్యారీ బ్యాగ్‌లో పువ్వులు వేసి ఇవ్వడంతో దుకాణ యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వాడకం నిషేధంలో ఉండగా ప్లాస్టిక్ కవర్లు ఎందుకు వాడుతున్నావని గట్టిగా నిలదీశారు. ప్లాస్టిక్ వాడినా, అమ్మినా వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని, భారీ జరిమానా, ఐదు సంవత్సరాల జైలు శిక్ష విధించడం జరుగుతుందని హెచ్చరించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల అనేక అనర్థాలు జరుగుతున్నాయని, ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిషేధించబడిందని తెలిపారు. షాపులు, హోటల్స్, స్వీట్ షాపులు, ఫ్లవర్ డెకరేషన్ షాపులు తరచూ తనిఖీ చేస్తామన్నారు.

నృత్య కళాకారుడు సంతోష్‌కుమార్‌కు సత్కారం

ప్రజాశక్తి - వీరవాసరం

కొణితివాడ పంచా యతీ నరసన్నచెరువుపాలెం గ్రామానికి చెందిన కూచిపూడి కళాకారుడు మల్లుల సంతోష్‌కుమార్, శిరీష దంపతులను నేషనల్ ఫ్లాగ్ టవర్ నిర్మాత వడ్డి సుబ్బారావు మంగళవారం సత్కరించారు. సంతోష్‌కుమార్ కూచిపూడి నృత్యాభ్యసనాన్ని పూర్తి చేసుకుని ఈ నెల 10న తాను విద్యనభ్యసించిన కొణితివాడ హైస్కూల్ వద్ద రంగప్రవేశం చేసిన విషయం తెలిసిందే. వడ్డి సుబ్బారావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఈ విధంగా శాస్త్రీయ నృత్యాన్ని నేర్చుకుని రాణించినవారు లేరన్నారు. ఈ నేపథ్యంలో సంతోష్‌కుమార్‌ను ప్రముఖులతో అభినందించామన్నారు. అనంతరం సంతోష్‌కుమార్ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో గునిపెల్లి అంజిబాబు, వడ్డి సూర్యకుమారి, స్థానికులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - మొగల్తూరు

గ్రామాల్లోని తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని సర్పంచి కవురు సావిత్రి ఆదినారాయణ అన్నారు. కాళీపట్నం పడమరలో జల జీవన్ మిషన్ పనులు మంగళవారం పంచాయతీ కార్యదర్శి ఎం.సత్య నారాయణతో కలిసి పరిశీలించారు ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడారు. గ్రామంలోని శివారు ప్రాంతాలకు పైప్‌లైన్లు ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో శుద్ధి జలాలు అందించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రామాని చిన్నారి పాల్గొన్నారు.



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న సర్పంచి, కార్యదర్శి

జంతువుల హక్కుల పరిరక్షణ సామాజిక బాధ్యత

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జంతువులకు కూడా హక్కులు ఉంటాయని, ఐక్యరాజ్య సమితి ప్రపంచ వ్యాప్తంగా జంతువుల హక్కుల పరిరక్షణ కోసం కొన్ని హక్కులు కల్పించాయని, వాటిని ప్రజలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కె.మురళీకృష్ణ అన్నారు. మంగళవారం జిల్లా జంతు సంక్షేమ సంఘం, జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో భీమవరం పశువుల ఆసుపత్రి ప్రాంగణంలో ప్రపంచ జంతువుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. డిప్యూటీ డైరెక్టర్ జావర్ హుస్సేన్ మాట్లాడారు. జంతువుల హక్కుల పరిరక్షణ సామాజిక బాధ్యత అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి జంతు హక్కుల పరిరక్షణ ప్రతిజ్ఞ నిర్వహించి సర్ సివి రామన్ స్కూల్ విద్యార్థులకు జంతువుల హక్కుల పరిరక్షణ - మానవుల బాధ్యత అనే అంశంపై పోటీలు నిర్వహించామని, 37 మంది విద్యార్థులు పాల్గొన్నారని, వారందరికీ అధికారుల సౌజన్యంతో బహుమతులు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ పెండ్యాల సరిత, ఉపాధ్యాయులు శైలజ, పార్వతి పాల్గొన్నారు.

లేసుపార్కును పరిశీలించిన కేంద్రం బృందం

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని సీతారాంపురం లేసుపార్కును మంగళవారం సెంట్రల్ టీమ్ సభ్యులు పరిశీలించారు. పశ్చిమ జిల్లాను వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్టులో భాగంగా క్రోచెట్ లేసును నేషనల్ లెవెల్లో ఎంపిక చేశారు. దీనిలో భాగంగా భారతదేశంలో 450 ఉత్పత్తులను ఆన్‌లైన్లో దేశ వ్యాప్తంగా పంపించారు. వాటిలో నుంచి 40 ఉత్పత్తులు సెంట్రల్ టీమ్ సభ్యులు ఎంపిక చేశారు. కమిటీ సభ్యులు పరిశీలించి వాటిలో ఒకదాన్ని బెస్ట్‌గా ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎపి హెచ్‌సివిసి అండ్ ఎండి ఎం.విశ్వకేంద్ర బృందం జాస్మన్కౌర్, నచ్చికత మిట్టల్, డిఆర్‌డిఎ పీడీ ఎం.వేణుగోపాల్, కె.అప్పారావు, రవీంద్రగౌతమ్ పాల్గొన్నారు.

12, 13 తేదీల్లో ఛాంబర్స్‌లో జాబ్ మేళా

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో 12, 13 తేదీల్లో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఐసిఐసిఐ బ్యాంక్, టాప్ కమర్షియల్ బ్యాంక్, ఎఫ్‌ఎస్ ఐటి సొల్యూషన్స్ కంపెనీల్లో జాబ్ ఇంటర్వ్యూలు ఉదయం 9 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఏదైనా డిగ్రీలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై వయస్సు 27 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. సంవత్సరానికి రూ.2.2 నుంచి రూ.5 లక్షల వరకూ జీతం, ఇతర సదుపాయాలు ఉన్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు అభ్యర్థులు 9849712739, 9912046234 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - నరసాపురం

ఈ నెల 13న మండలంలోని పలు గ్రామాల్లో జరిగే రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి అధికారులను ఆదేశించారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఒలు, సర్వేయర్లతో సమీక్షించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఆర్ఐ లక్ష్మీనారాయణ, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

విద్యాసంస్థల సందర్శన

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎస్‌ఎస్‌ఎం ప్రభుత్వ కళాశాలలో ఔట్రీచ్ ప్రోగ్రాంలో భాగంగా పూలపల్లిలోని జెడ్‌పి హైస్కూల్‌ను కళాశాల ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి అధ్యాపక సిబ్బంది సందర్శించారు. హైస్కూల్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. విద్యలో ఉన్నత స్థాయి ప్రమాణాలను ప్రోత్సహించడానికి అధ్యాపకులచే విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడానికి 2024 నుంచి 2027 వరకూ మూడేళ్ల సహకారం అందిస్తారు. ప్రతి సంవత్సరమూ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా విద్యార్థులకు కళాశాలలో వారి పాఠ్యాంశాలకు సంబంధించిన విషయాలపై అవగాహన కలిగించడం, ఆటల పోటీలు, వక్తృత్వ పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. అనంతరం కళాశాలలోని ప్రయోగశాలలను, కంప్యూటర్ ల్యాబ్‌లు, సెమినార్ హాల్, డిజిటల్ క్లాస్ రూమ్‌లను, గ్రంథాలయాన్ని సందర్శించారు.

పాస్‌పోర్టు పోయినది

పీతల జయ భారతి భర్త : రవింద్రబాబు అను నేను పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం మండలం కొండపల్లి గ్రామానికి చెందిన అను నేను నా యొక్క పాస్‌పోర్టు పడిపోయింది. పొన్నపల్లి గ్రామం నుండి మార్టేరు మీదుగా ఓడూరు వెళు తుండగా నా యొక్క పాస్‌పోర్టు మార్గమధ్యంలో పడిపోయినది. నా యొక్క పాస్‌పోర్టు నెంబర్ : E5247322 గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన ఏడల ఈ క్రింది అడ్రస్ తెలియజేయగలరు.

పీతల జయభారతి, భర్త : రవింద్రబాబు
డోర్ నెంబర్ : 2 -7 -23 /1
పొన్నపల్లి, నరసాపురం మండలం,
ప.గో.జిల్లా. సెల్ : 7569212464

ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S.No.164/2019

Between:
బ్యాంకు ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్
రి.బై బ్రాంచ్ మేనేజర్ ...వాది
అండ్
మాదేటి నరసింహస్వామి వగైరా ...ప్రతివాదులు
టు
1వ ప్రతివాది :
మాదేటి నరసింహస్వామి, తండ్రి రామాను జయదాసు, డోర్‌నెం.4-18, యాళ్ళవానిగరువు, పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నంబరు దావాను మీపైన వాది బ్యాంకు వారికి రావలసిన బాకీ రాబట్టుకొనుటకు గానూ మీపైన మరియు 2వ ప్రతివాది పైన శ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నంబరు దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం 1వ ప్రతివాది అయిన మీకు త్రు కోర్టు ద్వారా మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున, శ్రీకోర్టు వారు ప్రత్యామ్నాయ సర్వీస్ అయిన పేపర్ ప్రకటన ద్వారా దావా సమన్లు పంపించమని ఉత్తర్వులు ఇస్తూ ది.07-01-2025 తేదికి వాయిదా వేసియున్నారు. కావున 1వ ప్రతివాది అయిన మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా ది.07-01-2025 సం॥రం తేదీన ఉదయం గం.10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్పు చెప్పబడును అని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

అడబాల సుబ్రహ్మణ్యం B.Com., B.L.
అడ్వకేట్, నరసాపురం, ప.గో.జిల్లా.
నరసాపురం స్టాండింగ్ కౌన్సిల్ ఫర్ బ్యాంకు
తేది.09-12-2024 ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్

ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S.No.154/2019

Between:
బ్యాంకు ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్
రి.బై బ్రాంచ్ మేనేజర్ ...వాది
అండ్
మాదేటి నరసింహస్వామి వగైరా ...ప్రతివాదులు
టు
1వ ప్రతివాది :
మాదేటి నరసింహస్వామి, తండ్రి రామాను జయదాసు, డోర్‌నెం.4-18, యాళ్ళవానిగరువు, పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నంబరు దావాను మీపైన వాది బ్యాంకు వారికి రావలసిన బాకీ రాబట్టుకొనుటకు గానూ మీపైన మరియు 2వ ప్రతివాది పైన శ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నంబరు దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం 1వ ప్రతివాది అయిన మీకు త్రు కోర్టు ద్వారా మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున, శ్రీకోర్టు వారు ప్రత్యామ్నాయ సర్వీస్ అయిన పేపర్ ప్రకటన ద్వారా దావా సమన్లు పంపించమని ఉత్తర్వులు ఇస్తూ ది.07-01-2025 తేదికి వాయిదా వేసియున్నారు. కావున 1వ ప్రతివాది అయిన మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా ది.07-01-2025 సం॥రం తేదీన ఉదయం గం.10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్పు చెప్పబడును అని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

అడబాల సుబ్రహ్మణ్యం B.Com., B.L.
అడ్వకేట్, నరసాపురం, ప.గో.జిల్లా.
నరసాపురం స్టాండింగ్ కౌన్సిల్ ఫర్ బ్యాంకు
తేది.09-12-2024 ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్

ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S.No.103/2021

Between:
బ్యాంకు ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్
రి.బై బ్రాంచ్ మేనేజర్ ...వాది
అండ్
కాటూరి సూరిబాబు వగైరా ...ప్రతివాదులు
టు
2వ ప్రతివాది :
తిరుమాని వెంకటేష్, తండ్రి ములాస్వామి, డోర్‌నెం.5-133, యాళ్ళవానిగరువు, పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నంబరు దావాను మీపైన వాది బ్యాంకు వారికి రావలసిన బాకీ రాబట్టుకొనుటకు గానూ మీపైన మరియు 1వ ప్రతివాది పైన శ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నంబరు దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం 2వ ప్రతివాది అయిన మీకు త్రు కోర్టు ద్వారా మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపించినను తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున, శ్రీకోర్టు వారు ప్రత్యామ్నాయ సర్వీస్ అయిన పేపర్ ప్రకటన ద్వారా దావా సమన్లు పంపించమని ఉత్తర్వులు ఇస్తూ ది.07-01-2025 తేదికి వాయిదా వేసియున్నారు. కావున 2వ ప్రతివాది అయిన మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా ది.07-01-2025 సం॥రం తేదీన ఉదయం గం.10.30 ని॥లకు పైకోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్పు చెప్పబడును అని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

అడబాల సుబ్రహ్మణ్యం B.Com., B.L.
అడ్వకేట్, నరసాపురం, ప.గో.జిల్లా.
నరసాపురం స్టాండింగ్ కౌన్సిల్ ఫర్ బ్యాంకు
తేది.09-12-2024 ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్